నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | మే 17, 2024 | www.navatelangana.com

డెంగ్యూ వ్యాధి నివారణ ప్రజల చేతుల్లోనే

నవతెలంగాణ-ఇచ్చోడ

డెంగ్యూ వ్యాధి నివారణ పూర్తిగా ప్రజల చేతుల్లోనే ఉందని తలమద్రి పల్లె దవాఖాన వైద్యులు ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని పట్వారీగూడ గ్రామంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి ప్రశాంత్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుభాష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు టీఎన్‌జీఓ నాయకుల శుభాకాంక్షలు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసినందుకు టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు, ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడం ఎంతో గొప్పవిషయమని కొనియడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీరామ్ శ్రీనివాస్, సెక్రటరీ ఎస్ మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాములు, టౌన్ కార్యదర్శి డి శ్రీనివాస్, శ్రీకాంత్, అరుణ్, సుధాకర్ పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ముథోల్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని రబీంద్రా ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 8మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. దీంతో మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు మోహన్‌రావు పటేల్ మాట్లాడారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, కరెస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా.సర్వరాజ్ మాట్లాడారు. జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, వికారం, వాంతులు వచ్చినట్టు అన్పిస్తే డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా గుర్తించి డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. రాబోవు వర్షాకాల ప్రారంభంలో దీని ప్రభావం ఉంటుందన్నారు. ఇంటి పరిసరాల్లో డబ్బాలలో, పాత టైర్లలో, పూలకుండీలలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆడే సురేష్, కొడప యశోద, లక్ష్మీబాయి, ఖండాల ఎంఎల్‌హెచ్‌పి మైజొద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, ఇందుబాయి, అశా కార్యకర్తలు జయ, రుక్మిణి, సునీత, సుమిత్ర, అనసూయ, లక్ష్మి, జనాబాయి, స్టాఫ్‌నర్స్ గంగామణి, తిరుమల పాల్గొన్నారు.

ఎంపీడీఓ గ్రామాల సందర్శన



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పంచగుడి, జోహార్‌పూర్, అబ్దుల్లాపూర్ గ్రామాలను గురువారం ఎంపిడిఓ సోలమన్ రాజ్ సందర్శించారు. గ్రామాలలో పారిశుధ్య కార్యకలాపాల నిర్వహణ, నర్సరీ, నీటి సరఫరా సమస్యలు, క్రీడా ప్రాంగణం, శ్మశానవాటిక, పల్లెప్రకృతి వనాలను సందర్శించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. వాటి సరైన నిర్వహణ కొరకు పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

ఆకతాయిలు వేధిస్తే చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు, విద్యార్థులను ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంను సంప్రదించాలని షీటీం బృందం సభ్యులు సుశీల, సత్యమోహన్ సూచించారు. షీటీం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఓ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి ఆపద వచ్చిన తమను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. విద్యార్థులకు షీటీం సేవలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా తదితర వాటిపై అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ నెంబర్స్ గురించి వివరించారు.

పత్రాల కోసం పరేషాన్..!

- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- అధికారులు..సిబ్బంది కాలయాపనతో నరకయాతన
- ముడుపులు ముట్టజెప్పనిదే లభించని పరిష్కారం
- ప్రక్షాళన చేస్తేనే అన్నదాతలు, లబ్ధిదారులకు ప్రయోజనం

ప్రతి మనిషికి రెవెన్యూ కార్యాలయంతో సంబంధం ఉంటుంది. ఏదేని ధ్రువపత్రం కావాలన్నా..ఈ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందే. ముఖ్యంగా రైతుల జీవితాలన్ని తహసీల్దార్ కార్యాలయాలతోనే ముడిపడి ఉంటాయనడంలో సందేహం లేదు. ఇంతటి కీలక కార్యాలయాల్లో అవినీతి, అలసత్వం రాజ్యమేలుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా..పాలకులు మారుతున్నా ఈ కార్యాలయాల పనితీరు మాత్రం మారడం లేదు. వివిధ చోట్ల తహసీల్దార్ కార్యాలయాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)కి పట్టుబడుతున్నా అక్రమాల పర్వం ఆగడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రక్షాళన చేద్దామని ప్రభుత్వాలు ఎంత ప్రయత్నించినా..ఏదో ఒక లోపాన్ని సాకుగా తీసుకొని ఈ అమ్యామ్యాల పరంపర కొనసాగుతోందనే విమర్శలున్నాయి. ఫలితంగా చిన్నసన్న కారు రైతులతో పాటు విద్యార్థులు, వివిధ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వస్తోంది.



బేల మండలానికి చెందిన ఓ రైతు బ్యాంకులో దీర్ఘకాలిక పొందేందుకు 13ఏండ్ల పహణీలు, ల్యాడ్ వాల్యూయేషన్ సర్టిఫికేట్ కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. సదరు రైతు ఈ కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోవడంతో అక్కడి సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెపితే కానీ పని కాలేని పరిస్థితి. . మరణ,డిపెండెంట్ సర్టిఫికేట్, భూమి కొలతలు ఇలా ఏ పని కావాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితి ఇదే మండలానికి పరిమితం కాదు..దాదాపు అన్ని మండలాల్లో చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, బేల

రైతులు, విద్యార్థులు, లబ్ధిదారులకు వెన్నుదన్నుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో ముందువరుసలో ఉండాల్సిన రెవెన్యూ కార్యాలయలు వారికి అవస్థల నిలయాలుగా మారుతున్నాయి. ప్రతి చిన్న పనికి కూడా ఏదో రూపంలో ముట్టజెబితే కానీ పరిష్కారం లభించని స్థితికి దిగజారుతున్నాయి. కొందరు అధికారులు, సిబ్బంది కాసుల కక్కుర్తి కారణంగా అమాయక రైతులు, వివిధ పథకాల పొందే పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతులకు సంబంధించి పహణీలు, రిజిస్ట్రేషన్లు, ఫారమ్ నెం.7, భూమి వాల్యూయేషన్, భూమి కొలతలు, మరణ, డిపెండెంట్ సర్టిఫికేట్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు తదితర వాటి కోసం తప్పనిసరిగా రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంటుంది. ఆయా పత్రాల కోసం దరఖాస్తులు చేసిన తర్వాత వాటిని పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది నిర్దిష్ట కాలపరిమితి లోపు అందజేయాల్సి ఉంటుంది. కానీ నెలలు గడుస్తున్నా ఆయా ధ్రువపత్రాలు లబ్ధిదారుల దరికి చేరడం లేదు. కొందరు రైతులు, వివిధ పథకాలు పొందే లబ్ధిదారులకు ఆయా పత్రాలు త్వరగా సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇదే అవకాశంగా భావిస్తున్న కొందరు సిబ్బంది రోజుల తరబడి కార్యాలయాల వెంట తిప్పుతున్నారు. ఈ బాధలు భరించలేని కొందరు రైతులు వారికి ఎంతో కొంత ముట్టజెపుతున్నారు. దీంతో కార్యాలయాల వెంట తిరగాల్సిన ఇబ్బందులు లేకుండా సులువుగా పని అవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కొన్ని కార్యాలయాల్లో భూమి కొలతల కోసం చలాన్లు కట్టి రోజుల తరబడి సర్వేయర్ల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వారితో లోపాయికారి ఒప్పందం చేసుకున్న వారికి మాత్రం తొలి ప్రాధాన్యమిస్తున్నారని..చలాన్లు కట్టి నెల గడుస్తున్నా మా పొలాలకు వారు రావడం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడుతున్నా మారని తీరు..!

జిల్లాలోని కొన్ని తహసీల్దార్ కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రతి ఏటా ఒకటి, రెండు చోట్ల ఈ కార్యాలయాల్లో వివిధ స్థాయిలోని అధికారులు, సిబ్బంది అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి పట్టుబడుతున్న సందర్భాలున్నాయి. కిందటేడాది భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి డబ్బులు తీసుకున్నారనే కారణంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన తహసీల్దార్, ఆర్ఐలు ఏసీబీకి పట్టుబడ్డాయి. నిర్మల్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన తహసీల్దార్ సైతం ఏసీబీకి పట్టుబడిన ఉదంతాలు ఉన్నాయి. మరోపక్క గత ప్రభుత్వం భూ సంబంధిత సమస్యల పరిష్కారం.. రెవెన్యూ ప్రక్షాళన చేద్దామని భావించి ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. కానీ అందులోనూ అనేక లోపాలు ఉండటంతో వీటిని అవకాశంగా మల్చుకుంటున్న కొందరు అధికారులు, సిబ్బంది ఇందులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీర్ఘకాలికంగా భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభించక అనేక మంది రైతులు అవస్థలు పడుతుండగా.. కొందరు ఆ బాధలు భరించలేక సిబ్బందికి ఎంతో కొంత ముట్టచెపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం..పాలకులు, ఉన్నతాధికారులు ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించి రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని రైతులు, లబ్ధిదారులు కోరుతున్నారు.

పానీ పట్టు యుద్ధం..!

- తలాపున గోదావరి ఉన్న తాగు నీరు కరువు
- నిర్వాసితుల గొంతు తడపని ఎల్లంపల్లి నీరు
- తాగునీరందించడంలో యంత్రాంగం విఫలం
- 13వ బెటాలియన్ కుళాయి వద్ద రద్దీ

తలాపున గోదావరి ఉన్నట్లే కానీ ఎల్లంపల్లి నిర్వాసితులకు మాత్రం ఆ నీరు తాగే భాగ్యం లేకుండా పోతోంది. ఇంటింటికి మిషన్ భగీరథ పేరుతో నల్లాలు బిగించారు కానీ ఇప్పటికీ శుద్ధ జలం అందించడం లేదు. ఇక్కడి నీరు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ వంటి మహానగర ప్రజల దాహార్తిని తీరుస్తుంది. కానీ ఇక్కడి నిర్వాసితులకు తాగేందుకు గుక్కెడు నీరు లేక తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అధిక గ్రామాల ప్రజలు 13వ పోలీస్ బెటాలియన్ పెట్రోల్ పంపులోని నల్లా నీటినే తాగుతున్నారు. అక్కడ డబ్బా నిండాలంటే గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.


వరుసలో నిలబడి నల్లా వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

నవతెలంగాణ - హాజీపూర్

ఎల్లంపల్లి ప్రాజెక్టులో మంచిర్యాల మండలంలోని 9గ్రామాలు ముంపునకు గురికాగా సుమారు నాలుగు వేలకు పైగా కుటుంబాలు నిర్వాసితులుగా మారారు. అయితే పునరావాస కాలనీల్లో ఇప్పటి వరకు తాగు నీరు అందడం లేదు. కాలనీలు ఏర్పాటు చేసి 10ఏండ్లు గడచినా వీరికి తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఈ కాలనీలన్నీ గోదావరికి, ఎల్లంపల్లికి 2కిలో మీటర్ల దూరంలో మాత్రమే ఉండడం గమనార్హం. కాలనీలు ఏర్పాటు చేసినప్పుడు వాటర్ ట్యాంక్‌లు నిర్మించి నల్లాలు మాత్రమే బిగించారు. కానీ వాటి నుండి శుద్ధ జలం సప్లై చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీరు అందిస్తున్నామని చెప్పింది. కానీ తమ ఇండ్లకు మంచి నీరైతే రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 5నెలలు అయినప్పటికీ తాగు నీటి సరఫరాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి మంచిర్యాల, బెల్లంపల్లి వంటి పట్టణాలకు సంవత్సరాలుగా తాగు నీరు సరఫరా చేస్తున్న అధికారులు ప్రస్తుతం మాకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఎల్లంపల్లి నుండి 300కిలో మీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ వంటి నగరాలకు తాగు నీరందుతుంది కానీ ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేసిన తమకు మాత్రం గుక్కెడు నీరు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎండలు ముదరడంతో నీటి అవసరాలు పెరిగాయి. ఓ పక్క ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా అధికారులు చెబుతున్నారు. కానీ సరఫరా చేసే నీటిని 10 శాతం మంది కూడా తాగడం లేదు. నీరు మురికిగా వస్తుండడంతో తాగలేకపోతున్నారు.

ఒకే నల్లా..ఏడు గ్రామాల ప్రజలు..

13వ బెటాలియన్ సిబ్బందికి తాగు నీటి కోసం ముల్కల్ల వద్ద గోదావరి నదిలో పంప్ హౌస్ ఏర్పాటు చేసి అక్కడి నుండి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. బెటాలియన్ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో నల్లాను 10 ఏండ్ల క్రితం బెటాలియన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ నల్లా నీటి కోసం చుట్టు పక్కల ఎల్లంపల్లి పునరావాస కాలనీల ప్రజలే కాక గుడిపేట్, నంనూర్, రాపల్లి, కర్ణమామిడి, పడతనపల్లి, నర్సింగపూర్, చందనపూర్ గ్రామాల నుండి కిలో మీటర్ల దూరం నుండి వచ్చి తాగు నీరు తీసుకుపోతుంటారు. నిత్యం వందల మంది ఇక్కడి నల్లా ద్వారా తాగు నీటిని తీసుకెళ్తుంటారు. గంటల తరబడి లైన్‌లో ఉండి నీటిని పట్టుకుంటున్నారు. ఇక్కడ క్యాన్ నిండితే యుద్ధంలో గెలిచినంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

తాగు నీటికి ప్రయాస తప్పడం లేదు : రాజేందర్, నంనూర్ గ్రామం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేసి నిర్వాసితులమైన మాకు ప్రభుత్వం తాగు నీరందిస్తామని చెప్పింది. పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు గడుస్తున్నా నీళ్లయితే రావడం లేదు. బెటాలియన్ దగ్గరి నల్లా నీటి కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించి గంటల తరబడి నిలబడి నీళ్లు పట్టుకుంటున్నాం. ఈ ప్రాజెక్ట్ నీరు హైదరాబాద్ పోతుంది కానీ కూతవేటు దూరంలో ఉన్న మాకు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ఇంటింటికీ శుద్ధమైన తాగు నీరు సరఫరా చేయాలి. మిషన్ భగీరథ పేరుతో నల్లాలు ఏర్పాటు చేశారు కానీ ఆ నీరు తాగడానికి భయంగా ఉంది.

రంగు చూసి జనం తాగడం లేదు : గిరిజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, హాజీపూర్

ఇంటింటికి తాగు నీరు సరఫరా అవుతోంది. క్లోరినేషన్ చేసిన శుద్ధ జలాన్ని సరఫరా చేస్తున్నాం. రంగు చూసి ప్రజలు అపోహాలు పడుతూ తాగడం లేదు. పలు మార్లు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశాం. ట్యాప్ ద్వారా వచ్చే నీటిని తాగడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు.

సీఎంఆర్ పూర్తిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పూర్తిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మిల్లర్లను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి మిల్లరు నిర్దేశించిన గడువులోగా సిఎంఆర్ సరఫరా పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లుల వారీగా లక్ష్యం, పూర్తిచేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం వివరాలను మిల్లర్ల వారీగా సమీక్షించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లులో ధాన్యం నిల్వ సామర్థ్యం, అన్‌లోడింగ్ తదితర అంశాలను పరిశీలించి రోజూవారి నివేదికలను అందజేయాలని సూచించారు.

అలాగే ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వారం రోజులుగా సీఎంఆర్ సరఫరా చేయని మిల్లర్లకు నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్ఓ భుజంగ్‌రావు, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్‌వో నందిత, డీఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, తహసీల్దార్లు, అధికారులు, మిల్లర్ల పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మే 17, 2024 | www.navatelangana.com

వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించిన డీఎం శ్రీకళ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర, మన్మథ్ గ్రామాల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న వరి కొనుగోలు కేంద్రాలను గురువారం డీఎం శ్రీకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల



సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అకాల వర్షాల కారణంగా ధాన్యం తడుస్తుందని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, టీఏ తిరుపతిరెడ్డి, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ గంగాధర్, రైతులు ఉన్నారు.

గాలి దుమారం.. విరిగిపడ్డ చెట్టు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గాలిదుమారం, ఒకేసారి ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షానికి రోడ్డుపై చెట్టు విరిగి పడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గురువారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామం వద్ద ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగి పోవడంతో ఉట్నూర్, మంచి ర్యాల, కుమురంభీం నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈశ్వర్‌నగర్ సర్పంచ్ భర్త సునీల్, గ్రామ యువకులు వెంటనే వచ్చి మిషన్ సహాయంతో చెట్టును కట్ చేసి రొడ్డు నుంచి తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను సరిచేసి వాహనాలను పంపించారు. గ్రామస్తులు పలువురు అభినందించారు.



హామీనిచ్చి మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- దొడ్డు వరికి బోనస్ చెల్లించాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల మెనిఫెస్టోలో వరికి రూ.500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు సన్నం వరికే బోనస్ ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. దొడ్డు వరిని రోడ్డుపై వేసి బోనస్ చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు వరికి రూ.500 బోనస్ చెల్లిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. కానీ ఇప్పుడు కొనుగోళ్ల సమయంలో కేవలం సన్న వరికే బోనస్‌ను ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో కేవలం 10 శాతం సన్నం వరి పండిస్తున్నారని, మిగిత 90 శాతం దొడ్డు వరిని పండిస్తున్నారని తెలిపారు. వరిలో ఎన్నిరకాలు పండిస్తున్నారో అందరికి బోనస్ చెల్లించాలన్నారు. అదే విధంగా వర్షకాల పంటల కోసం విత్తనాలు, ఎరువులు అన్ని సిద్ధంగా ఉంచాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా కింద రూ.15 వేలను ఏకకాలంలో రైతులతో పాటు కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు సుభిక్షంగా ఉండాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రైతులను మోసం చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని, అప్పటి వరకు రైతులకు అండగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, ఆదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేష్, నాయకులు రాము, సలీం పాషా, సాజీదోద్దీన్ పాల్గొన్నారు.

బోథ్ : రైతులు పండించిన పంటలకు బోనస్‌తో పాటు పంటలు పూర్తిగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ అసలే అతివృష్టి అనావృష్టి వలన నష్టాల్లోలో ఉన్న రైతులు అకాల వర్షాలతో పంటలు తడిసిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పంటలకు క్వింటాలుకు రూ.5వందల బోనస్‌తో పాటు రైతులకు రైతు భరోసా కింద రూ.15వేలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు బోడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌ల మండలాధ్యక్షుడు శ్రీదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల కార్యదర్శి ఎలుక రాజు, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఆత్మ చైర్మెన్ సుభాష్, డాక్టర్ స్వామి, నాయకులు సురేష్, రమేష్, బి.లింగారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.



బోథ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఈదురు గాలుల బీభత్సం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని లాల్‌టెకడి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల కారణంగా ఇండ్లపై కప్పు లేచి కింద పడిపోయాయి. వర్షంతో ధాన్యం, వస్తువులు తడసి ముద్దయ్యాయి. విషయం తెలుసుకున్నా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం లాల్‌టెకడి గ్రామాన్ని సందర్శించి, కూలిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్థార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. నష్టపోయిన వారికీ తక్షణ సాయం అందజేయాలని సూచించారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి గ్రామంలోని విద్యుత్ సమస్యను సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వ పరంగా అదుకుంటామని హామీ ఇచ్చారు. తనవంతుగా భారీగా నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే తరలించాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్మల్ ఆర్డీఓ రత్నకళ్యాణి గురువారం పరిశీలించారు. దిలావర్‌పూర్, బాన్సపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరి ధాన్యన్ని కొనుగోలు చేయాలని, వరి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నామని వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, కొనుగోలు కేంద్రాల నుంచి తరలించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, వ్యవసాయ అధికారి స్రవంతి, ఆర్ఐ సంతోష్ ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులందరికీ ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీష్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పనను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్నదని గ్రామీణ ప్రాంత విద్యార్థులు అనేకమంది పట్టణానికి చదువు కోవడానికి ప్రతీరోజూ బస్సులో ప్రయాణం చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందని అలాగే విద్యార్థులు అందరికీ ఉచిత బస్సుపాస్‌లు ఇచ్చినట్టైతే విద్యార్థులకు చాలా ప్రయోజనం కలుగుతుందని, ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా ఆలోచించి, విద్యార్థులు అందరికి ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీకర్, శ్రీశాంత్, విశాల్, శివమణి పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మెయిన్‌రోడ్డు, బస్‌స్టాండ్ వద్ద సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టక పోవడంతో చిన్న పాటి వర్షం పడిన రోడ్డు బురదతో నిండి చిత్తడిగా తయారై పోతుంది. గురువారం పడిన వర్షంతో ప్రయాణికులు, వాహనదారులు పోవడానికి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత శాఖ అధికారులు గమనించి, రోడ్డు పక్కకు సైడ్ డ్రైన్ నిర్మించి రోడ్డుపై నీరు రాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

వరి ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.5వందలు బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరు అధైర్య పడొద్దని సూచించారు. ప్రజలకు నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. వివిధ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఉన్న తడిసిన జొన్నలను ప్రభుత్వం త్వరగా కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు.

క్రీడా దుస్తులకు నగదు అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో మే 18 నుంచి జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి అశోక్ మహారాజ్, యూపీ ధాబా, కోర్టికల్ లీగ్‌లో పాల్గొనే ఏ స్పార్టన్ వారియర్స్ ఏ జట్టు సభ్యులకు క్రీడాదుస్తుల కోసం రూ.10వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్ అనిల్ కుమార్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్ కుమార్, లఖన్, మణిరాజ్, పాండు, యోగి, జైరాం పాల్గొన్నారు.

ఐటీఐకి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉట్నూర్‌లో విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యాసంవత్సరానికి వెబ్‌సైట్ ఐటీఐ.తెలంగాణ.గావ్.ఇన్ ఆన్‌లైన్‌లో గురువారం నుంచి జూన్ 10 వరకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌ను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్లే చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు ఆగస్టు 01వరకు 14 సంవత్సరాలు నిండి ఉండాలని కోరారు. సంప్రదించాల్సిన మొబైల్ నెంబర్ : 9490202037

సోషల్ మీడియా సమావేశానికి రేంకల శ్రీనివాస్

నవతెలంగాణ-కడెం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాదాపూర్‌లోని ఓ హోటల్లో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఖానాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రేంకల శ్రీనివాస్ హాజరయ్యారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ ఎంతో కృషి చేశారని తెలిపినట్టు పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించిన ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టును గురువారం ఉదయం ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ సందర్శించి, ప్రాజెక్టు మరమ్మత్తుల పనులను పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్టుకు నిధులు కేటాయించిందని తెలిపారు. అందులో భాగంగానే పనులు చేపడుతున్న క్రమంలో ప్రాజెక్ట్ అధికారులతో కలిసి సీఈ శ్రీనివాస్ సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను వేగవంతంగా చేపట్టాలని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఆయా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, డిప్యూటీ సీఈ మదుసుధన్‌రెడ్డి, ఈఈ విఠల్, ఏఈఈ రవి నాయక్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పుసిగుడ, జామడ, బలాన్‌పూర్, నాగల్‌కొండ, గుంజాల, గంగాపూర్, తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల జొన్న పంట దెబ్బ తినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంతో ఉపశమనం లభించింది.

అమర జవాన్ సతీష్‌గౌడ్ వర్ధంతి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన గోడ్సే సతీష్‌గౌడ్ ఎనిమిదో వర్ధంతిని పురస్కరించుకొని సీఐ రంగారెడ్డి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006న క్యాంప్ సిర్ పిఫ్ జవాన్‌గా చత్తీస్‌ఘడ్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనపై నక్సలైట్‌లు ఎదురు కాల్పులు జరపగా తూటాకు అమరుడయ్యాడు ఎనిమిది సంవత్సరాల నుంచి కుటుంబ సభ్యులు తండ్రి లింగాగౌడ్, తల్లి సూర్యమాల తన కొడుకు జ్ఞాపకార్థం వర్ధంతి వేడుకలు చేస్తున్నారు. గ్రామ యువత దేశ రక్షణ కోసం జవాన్‌లు కావాలని ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమం బోథ్ ఎస్సై రాములు, సందీప్‌గౌడ్, అక్షయ్‌గౌడ్, కుటుంబ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డిపై పీఎస్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాతపై కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్టేషన్ సీఐ సత్యనారాయణను కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫిర్యాదును అందించారు. ఈ సందర్భంగా తంతోలి మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి గంద్రత్ సుజాత డబ్బులు తీసుకున్నారని ఆరోపించారని అన్నారు. కంది శ్రీనివాస్ కేవలం వ్యాఖ్యలు కాదు నిరూపించాలని డిమాండ్ చేశారు. నిరూపిస్తే తాము ఏ శిక్షకైన సిద్ధమని స్పష్టం చేశారు. మహిళలను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన ఆయనపై చట్ట రీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తంతోలి మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్, నాయకులు చిలుకూరి లక్ష్మారెడ్డి, ప్రభాకర్, మధుకర్, వసీం, ఇమ్రాన్, తుడుం వినోద్, రాసాం కిష్టు, మునీర్, నహీద్ ఉన్నారు.

అకాల వర్షం.. జొన్న పంటకు నష్టం..




నేలకొరిగిన జొన్న కంకులకు మొలకలు

నవతెలంగాణ-నార్నూర్

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కోతకు వచ్చే సమయంలో ప్రకృతి వైపరిత్యాలతో కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి రబీ పంట అయిన జొన్నపంటలు ఈదురుగాలులకు పూర్తిగా నేలకొరిగాయి. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కురుస్తున్న గాలి వానతో తాడిహత్నూర్‌తో పాటు పలు చోట్ల రబీ జొన్న పంటకు తీవ్ర నష్టం జరిగింది. చేతికి వచ్చిన జొన్న పంట వర్షానికి నేలకొరిగింది. దీనితో రైతులు కౌలు రైతులు ఆవేదనకు గురయ్యారు. అప్పుచేసి ఏడాదంతా కష్టం చేసి చేతికి వచ్చే సమయంలో పంటలు వర్షంతో దెబ్బ తినడంతో అప్పులు ఎలా తీర్చాలని నిరాశకు గురవుతున్నారు. ఇప్పటి కైన సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేవిధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి

రాథోడ్ గణేష్ రైతు



నేను కౌలు రైతుగా వ్యవసాయం చేసి అప్పులు తీసుకొని 6 ఎకరాల్లో అరు బ్యాగుల జొన్న పంట వేశాను. చేతికి వచ్చిన జొన్న వర్షంతో దెబ్బతింది. అదికారులు సర్వే చేసి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం మంజూరు చేయాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

పోష్లె విఠల్, రైతు



ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.నేను అప్పు చేసి నాలుగు ఎకరాల్లో మూడు బ్యాగులు రబీ జొన్న పంట వేశాను. కోసి నెల మీద పెట్టిన జొన్నలకు వర్షం కురువడంతో భూమి మీదనే మొలకెత్తింది. అప్పు తీర్చాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే పరిహారం చెలిస్తే రుణం తీర్చుకుంటా.

కొనసాగుతున్న రెంకోని వాగు బ్రిడ్జి పనులు

- రాకపోకలకు తొలగనున్న ఇబ్బందులు



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ సమీపంలోని రెంకోని వాగు బ్రిడ్జి పనులు చురుకుగా కొనతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వర్షాకాలం ఈ రహదారి మీదుగా వెళ్లే వారికి రాకపోకలకు ఇబ్బంధులు తొలగిపోతాయి. వర్షాకాలంలో రెంకోని వాగు పొంగి ప్రవహిస్తుండటంతో రోడ్ డ్యాం మునిగి బెల్లాల్ రూట్‌లో ఉన్న ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్, గోసంపల్లే, గోడల పంపు, బావాపూర్ (కె), గ్రామాలతో పాటు కడెం మండలంలోని, లింగాపూర్ ఎలగడప, మాసాయి పేట్, బెల్లాల్ వరకు గల గ్రామాల ప్రజలు రాక పోకలకు ఇబ్బంది పడే వారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.5.2 కోట్ల నిధులు మంజూరీ చేసింది. సదరు నిర్మాణ పనులను నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఇప్పటి వరకు 4 పిల్లర్స్, ఇరువైపుల రెండు అబర్ట్ మెంట్ పూర్తయినాయి. మరో పిల్లర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. స్లాబ్ పనులు సకాలంలో పూర్తిచేసి వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు సకాలంలోనే పూర్తి చేస్తాం

మల్లారెడ్డి, డీఈ, ఆర్అండ్‌బీ

ఇప్పటి వరకు సగం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగతా పనులను సకాలంలోనే పూర్తి చేస్తాం. బ్రిడ్జి నిర్మాణ స్థలం అడుగు భాగం గట్టి రాతితో ఉండటంతో పనులకు కొంత ఇబ్బంధి కలుగుతుంది. మిగిలిన పిల్లర్ పని పూర్తి చేసి స్లాబ్ పనులు తొందరగానే చేపడుతాం.

వానాకాలం సాగుకు సన్నద్ధం కావాలి : కలెక్టర్

- 18లోపు విత్తనాల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి
- విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వానకాలం సాగుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజర్శిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. డీలర్లు షాపుకు సంబంధించిన లైసెన్స్‌లు తప్పనిసరిగా వుండాలని, విత్తనాలు, ఎరువులు షాప్‌లో ఉన్న స్టాక్‌ను రోజు వారిగా నమోదు చేసి వీటికి సంబందించిన బిల్ బుక్, రిజిష్టర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మరాదని, గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులు అమ్మరాదని అన్నారు. ఎక్కడా కూడా విత్తనాలు, ఎరువుల కొరత ఉండకూడదని, జిల్లాకు సరిపడా విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల్లో విత్తనాలు ఎరువుల పూర్తి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞన్, వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, ఏడీలు, ఏఓలు, డీలర్లు పాల్గొన్నారు.



ఉచిత డిగ్రీ, ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పూర్తైన పేద విద్యార్థుల కోసం ఉచిత డిగ్రీ సీటు ఇవ్వడంతో పాటు, ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఉద్యోగం కల్పించడానికి వచ్చే ఆదివారం అనగా ఈ నెల 19న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు సంతోష్ కుమార్, నవీన్ రెడ్డి, డీవీడీసీ డైరెక్టర్స్ చంద్రమోహన్ గౌడ్ సెరీనా కళాశాల ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అభినవ స్వచ్ఛంద సేవ సంస్థ, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ సింగరేణి మాస్టర్ మోటివేటర్స్ బృందం, వివేకవర్ధిని విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత ఉద్యోగ మేళాలో ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటల వరకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 6303204295 లేదా 9440243777 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటు ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని 12వ వార్డు మురికి కాల్వల్లో వెలసిన పిచ్చి మొక్కలను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. మురికి కాల్వలు అస్తవ్యస్థంగా ఉండడంతో టీడీపీ నాయకులు గుల్లపల్లి ఆనంద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. అక్కడికి చేరుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి వెంటనే పిచ్చి మొక్కలు తొలగింపు చేయించారు.

కుక్కలున్నాయ్..పిక్కలు జాగ్రత్త..!

- నాలుగు నెలల వ్యవధిలో 30మందిపై దాడి
- పల్లెల్లో స్వైర విహారం చేస్తున్న శునకాలు
- పట్టించుకోని అధికారులు..భయాందోళనలో ప్రజలు

కుక్కలే కదా అని తీసిపారేయకండి.. ప్రస్తుతం ఈ జంతువులే హానికరంగా మారుతున్నాయి. ప్రస్తుతం పులి కనిపించినా భయం ఉంటుందో లేదో కానీ..కుక్క కనిపిస్తే చాలు జనాలు భయాందోళనలతో వణికిపోతున్నారు. వీధుల్లో స్వైర విహారం చేస్తూ కనిపించిన వారి పిక్కలు లాగుతున్నాయి. పలువురు చిన్నారులు సైతం తరుచూ వీటి బారినపడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. నడవలేని.. పరుగెత్తలేని వృద్ధులను సైతం వదలడం లేదు. గుంపులుగా ఉంటూ దారిన పోయే వారిపై అమాంతం దాడి చేస్తున్నాయి. వీటి అరుపులకు భయపడి పరుగెత్తిన వారి వెంటపడి మరీ కరుస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది. రోజురోజుకు పంచాయతీల్లో వీటి బెడద అధికమవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. శునకాల కారణంగా రెబిస్ వ్యాధి భారినపడే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

నవతెలంగాణ- బెజ్జూరు

మండలంలో కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుంది. దీంతో మండలవాసులు భయాందోలనకు గురవుతున్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలో ఏకంగా 30 మందిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి. కుక్కలు దాడిచేసినప్పుడు తూతూమంత్రంగా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గత నాలుగు నెలల కాలంలో పాపన్‌పేటలో ఎనిమిది మంది, కుకుడలో ముగ్గురు, బెజ్జూరులో ఐదుగురు, కృష్ణపెల్లిలో ఇద్దరు ఇలా ప్రతి గ్రామంలో కుక్కల దాడిలో ప్రజలు గాయపడుతూనే ఉన్నారు. శునకాల బారి నుండి మండల ప్రజలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని పాలకవర్గం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో ఇటు మనుషులతో పాటు మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. పదుల సంఖ్యలో మూగజీవాలు కుక్కకాటుకు గురై చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. కుక్కకాటుకు మందు దొరకని పరిస్థితిలో పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని మండలవాసులు అంటున్నారు. గత 10, 12 సంవత్సరాల క్రితం కుక్కకాటుతో మండలకేంద్రానికి చెందిన బాలుడు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా కూడా వాటిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారని మండలవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కల శరీరంపై చర్మం పూర్తిగా చెడిపోయి వికారంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి తమను కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు.



స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

మూగజీవాలను చంపుతున్నాయి

తిరుపతి, కుంటలమానెపెల్లి



కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మూగజీవులను చంపేస్తున్నాయి. కుక్కల నుండి కాపాడాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదు. కుక్కల బెడద నుండి తమను కాపాడాలి.

కుక్కల బెడద నుండి కాపాడాలి

నికాడి సురేష్, కృష్ణపెల్లి



మండలంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి నుండి తమను కాపాడాలి. గుంపులుగుంపులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని కుక్కల బెడద నుండి తమను కాపాడాలి.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌లతో కలిసి విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ప్రారంభించి 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ సంబంధిత పనులు, నియంత్రిక బోర్డులు, ఫ్యాన్లు తదితర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. బోర్ వెల్స్ మరమ్మత్తులు, ట్యాంకుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలల నిర్మించాలన్నారు. పాఠశాలలలో నెలకొన్న చిన్న, పెద్ద మరమ్మత్తు పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించే విధంగా విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు చూడాలన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం సిర్పూర్ నుండి గురువారం ఉదయం మహారాష్ట్రకు రేషన్ బియ్యం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాలను పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్ కాలనీ వద్ద చేసిన తనిఖీలో కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ షహబాజ్, మండోరె పవన్ కళ్యాణ్ బొలోరో వాహనంలో 25 క్వింటాళ్ల ఐదు కిలోల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి తరలిస్తున్న వారిపై కేసు నమోదుచేసినట్టు డీటీ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీలో హెడ్‌కానిస్టేబుల్ వీరస్వామి, కానిస్టేబుల్ రాంకుమార్ ఉన్నారు.

ఘనంగా జడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు స్థానిక కేస్లాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. తమ అభిమాన నాయకుడు ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య, నాయకులు కొట్నాక విజయ్, విశాల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సురేష్, సభ్యులు వేణుగోపాల్, కృష్ణంరాజు, ఏసీఎంఓ ఉద్దవ్, నజీర్, ముషిన్, శ్రీకాంత్, సత్యం, శ్రీశైలం, సంతోష్, బ్రహ్మం, సదాశివ్, నాగేష్ పాల్గొన్నారు.

జూన్ 8న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 8న జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఉన్న వివిధ రకాల కేసుల పరిష్కారం కోసం లోక్ అదాలత్ వినియోగించుకోవాలని సూచించారు. దీనికోసం ఈనెల 17న పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సకాంలో హాజరు కావాలన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతు బంధు రూ.15000 ఇస్తామని చెప్పి గతంలో ఇచ్చిన రూ.10000 కూడా పూర్తిస్థాయిలో రైతులకు ఇవ్వలేదన్నారు. రైతు రుణమాఫీ ఆగస్టు 15లోపు చేస్తామని, గతంలో వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆగస్టు 15న లేదా 2025 సంవత్సరంలో ఆగస్టు నెలలోన అనేది చెప్పాలన్నారు. ఖరీఫ్ ప్రారంభమవుతుందని ఇంకా దీనిపై అలస్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం పండించిన యాసంగి దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వారిపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రైతులకు అండగా ఉండి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నిరసన సందర్భంగా దాదాపు గంటపాటు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ జామ్ అయింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మాజీ సర్పంచ్లు భీమేష్, శ్రీనివాస్, కిష్టయ్య, నాయకులు సుప్రజ, నిసార్, కుమార్, వెంకన్న పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : రాస్తారోకోలో నల్లజెండాలతో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్ : రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం బీఆర్ఎస్ శ్రేణులు వంజిరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు లెండుగురె శ్యాంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని వాగ్దానాలు చేసిందని, అసెంబ్లీ ఎన్నికల ముందు 6 గారెంటీలు ఇస్తానని హామీ ఇచ్చి మోసపూరితంగా గద్దెనెక్కిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు రైతు బంధు పూర్తిగా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదని, గృహలక్ష్మి పథకం కింద రూ. 2500 రాలేదని రెవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తగులుతుందన్నారు. వరి పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తానని వాగ్దానం చేసి తీరా ఎన్నికలు జరిగాక సన్నం వడ్లు పండించే రైతులకు మాత్రమే బోనస్ ఇస్తానని, దొడ్డు వడ్లు పండించే రైతులకు ఇవ్వనని అంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నక్క శంకర్, సయ్యద్ మోయినోద్దిన్, అవుల రాజ్ కుమార్, గౌత్రె గోపాల్, బండు పటేల్, పార్వతి అంజన్న పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధికి కృషి

- డీటీడీఓ రమాదేవి
- వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని(డీటీడీఓ) రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రాల్లోని క్రీడా పాఠశాల మైదానంలో గురువారం నుండి ప్రారంభమైన మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల వేసవి క్రీడ క్యాంపును ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీడీఓ రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు క్రీడా శిబిరం కొనసాగుతుందని తెలిపారు. రెండు జిల్లాల్లోని గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి మాట్లాడుతూ రెండు జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న అత్యంత ప్రతిభ కనబరిచిన 60 మంది బాలురులు, 60 మంది బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆరు రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, క్రీడా శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ క్షేత్రయ్య, జైనూర్ ఏటీడీఓ పురుషోత్తం, ఎసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూఓ విజయశాంతి, పీడీ కృష్ణమూర్తి, పీఈటీలు గుండం లక్ష్మణ్, పెందూరు మంగవతి, శ్రీనివాస్, సుభాష్, సుమలత, కోచులు విద్యాసాగర్, తిరుమల్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవం



వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉప్రె వినయ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ అనే దోమ కుట్టడం ద్వారా వస్తుందని, ఇది కుట్టినప్పుడు జ్వరం, తల, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రాబోయేది వర్షాకాలం కాబట్టి ఇంటి వద్ద డబ్బాలు, పాత టైర్లలు, పూలకుండీలు, కవర్లు, మురికి కుంటాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతిరోజు శుభ్రం చేయాలన్నారు. వాటిపై మూతలు తప్పకుండా పెట్టాలని, అలా చేయడంతో వ్యాధి రాకుండా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : డెంగ్యూ నివారణకు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అఫ్రిన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య సిబ్బంది సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధు విక్టోరియా, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సావిత్రి, ఫార్మాసిస్టు రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌటాల : జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిని నివారించాలంటే పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలంటూ నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వృద్ధిని నివారించవచ్చని తెలిపారు.



పెంచికల్‌పేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్, సిబ్బంది



కౌటాలలో డెంగ్యూ నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది

24న ఎంపీపీ ఎన్నిక

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నికకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నియామకం ఈనెల 24న జరిగనుందని ఎంపీడీఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నారు. ఆయన వివరాల ప్రకారం గత ఎంపీపీ సునార్కర్ సువర్ణపై ఎంపీటీసీలు కొన్ని రోజుల క్రితం అవిశ్వాస తీర్మానం పెట్టారు. అది నెగ్గంతో ఆమె ఎంపీపీ పదవిని కోల్పోయింది. దీంతో కాగజ్‌నగర్ ఆర్డీఓ సమక్షంలో ఈ నెల 24న ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

పాఠశాలకు మల్టీ యూజర్ ప్రింటర్ అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో చదివిన పూర్వ విద్యార్థి నాగుల ప్రణయ పాఠశాలకు మల్టీ యూజర్ ప్రింటర్‌ను సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదివి వెళ్లిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా పాఠశాలను గుర్తుంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి నాగుల శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి కొడిప్యాక వేణుగోపాల్, సహ కార్యదర్శి బోగ మధుకర్, సభ్యులు కల్లూరి సంతోష్, జంజిరాల శ్రీనివాస్, ఆచార్యులు శారదా, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

గురజాలలో టీబీ నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి మండలంలోని గురిజాల సబ్ సెంటర్ పరిధిలో తాళ్ల గురియాలలో టీబీ నిర్ధారణకు తెమడ శాంపిల్స్ సేకరించారు. గురజాల గ్రామంలో 20 మంది తెమడను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు నోడల్ సూపర్‌వైజర్ సమ్మయ్య తెలిపారు. టీబీ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే సాధారణ జీవితం గడపవచ్చని ఎస్‌టీఎస్ శశికాంత్ తెలిపారు, టీబీ వ్యాధి సోకిన వారు సిగరెట్, తంబాకు, గుట్కా, పొగాకు ఉత్పత్తులు, మద్యానికి దూరంగా ఉంటూ వైద్యులు సూచించిన మందులను వాడాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఉచితంగా మందులను సరఫరా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త యశోద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్, కామన్‌పల్లి, దేవుని గూడ, కిష్టాపూర్, బంగారుతాండ, గ్రామాలలో గురువారం లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కవ్వాల్ గ్రామానికి చెందిన బుచ్చవ్వ వద్ద ఐదు లీటర్ల నాటు సారా, కామన్‌పల్లి గ్రామంలో అమృత వద్ద ఐదు లీటర్ల నాటు సారాన్ని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మిన, సారాయి తయారుచేసిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు సమ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, సాగర్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘాన్ని ఎన్నుకున్న ఫలితమేది..?



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు సింగరేణిలో ఎన్నికలు నిర్వహించి గుర్తింపు సంఘాన్ని ఎన్నుకున్న సమస్యలు పరిష్కార దిశగా వెళ్లడం లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీతో కలిసి ఆర్కే7 గనిలో కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కావాలని పట్టుబట్టి ఎన్నికలు పెట్టించిన ఏఐటీయూసీ నాలుగు సంవత్సరాల కాల పరిమితి కావాలని తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాయడం వల్లనే గుర్తింపు పత్రం ఆలస్యం అవుతున్నదన్నారు. వెంటనే ఏఐటీయూసీ కార్మిక సమస్యలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రెండు సంవత్సరాల కాల పరిమితితో కూడిన గుర్తింపు పత్రాన్ని తీసుకొని సొంతింటి కళ, అలవెన్స్‌లపై ఐటీ మాఫీ, మెడికల్ దందాతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు తెలిపిన సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ శ్రీధర్, పిట్ కమిటీ సభ్యులు సమ్మయ్య, ప్రవీణ్, నరేష్, అనిల్ పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు పంపిణీ చేసేందుకు జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రానికి చేరుకున్న ఏకరూప దుస్తుల క్లాత్ నిల్వలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం రోజు విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకొని పూర్తి చేసే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. సంబంధిత విభాగాలను సమన్వయం చేస్తూ ప్రణాళికబద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్యాశాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఏకరూప దుస్తుల క్లాత్‌ను మండల పాయింట్‌కు చేర్చి అక్కడి నుండి కుట్టు కేంద్రాలకు తరలించి త్వరగా తయారు చేసే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. మండల విద్యాధికారులు ప్రతి రోజు దుస్తుల తయారీపై పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పోచయ్య, విద్యాశాఖ సమన్వకర్తలు చౌదరి సత్యనారాయణమూర్తి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించిన ఆశాలకు వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల విధులు నిర్వహించిన ఆశలకు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆశా యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎస్.సమ్మక్కతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశ వర్కర్లకు ప్రభుత్వం చెల్లించే రెమ్యూనేషన్ డబ్బులు పూర్తిగా అధికారులు చెల్లించలేదని, కొంతమంది ఆశాలకు మాత్రమే ఇచ్చారన్నారు. అదే విధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆశాలందరు పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహించినప్పటికి నెలలు గడుస్తున్న ఇప్పటికి డబ్బులు చెల్లించలేదని, చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆశాలకు ప్రభుత్వం చెల్లించే రెమ్యూనేషన్ డబ్బులు మాత్రం ఇంకా చెల్లించకపోవడం సరైంది కాదన్నారు. కలెక్టర్ స్పందించి గత అసెంబ్లీ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశాలందరికి డబ్బులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు అమల, పద్మ పాల్గొన్నారు.

'ఆదివాసులపై దాడులను నిలిపివేయాలి'



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసి, గిరిజనులపై అటవీ అధికారులు దాడులను నిలిపివేయాలని సీపీఐ(ఎం) మండల నాయకులు కొండగుర్ల లింగన్న కోరారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాజును తాళ్లపేట అటవీశాఖ అధికారులు అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించారని ఆరోపించారు. ఆత్రం రాజును అటవీ అధికారులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు కూడా తెలపకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఆదివాసులపై అటవీ అధికారుల దాడులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయన్నారు. ఆత్రం రాజును వెంటనే వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, ఆత్రం సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ మండల ఫోటోగ్రాఫర్ పంబాల రమేష్ ఇటీవల మరణించగా రాష్ట్ర ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని అందించింది. రూ.లక్ష 91 వేల రూపాయల చెక్కును ఫోటోగ్రాఫర్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్ల కొండ కనకయ్య గురువారం బాధిత కుటుంబానికి అందించారు. ఫోటోగ్రాఫర్ల రాష్ట్ర సంఘం నుండి రూ1,55,000, మంచిర్యాల జిల్లా సంఘం నుండి రూ.10,000, తాండూర్ మండల యూనియన్ రూ.16,000, మండల సభ్యుడు సుధాకర్ రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నల్ల సతీష్, తాండూరు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గని రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతరవేణి తిరుపతి, మొగిలి సత్యనారాయణ, మందమర్రి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పసుల వెంకటస్వామి, అశోక్ కుమార్, కోశాధికారి రామటంకి రమేష్, ఉపాధ్యక్షులు మోయిన్, రవి కిరణ్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-లక్సెట్టిపేట

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం మండలంలోని జెండ వెంకటాపూర్ గ్రామపంచాయతీ కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, లక్ష్మీపూర్ గ్రామపంచాయతీలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, పరిస్థితులను అడిగి తెలుసుకుంటు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులను ఈ నెలాఖరు లోపల పూర్తి చేయాలని సంబంధిత వీఓ గ్రూపులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రసాద్, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బధావత్ సంతోష్ అన్నారు. "డెంగ్యూ నివారణ మా బాధ్యత - సురక్షితమైన రేపటి కోసం" అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం మండలం వేంపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత, జిల్లా సర్వేయలెన్స్ అధికారి ఫయాజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డెంగ్యూ లాంటి విషజ్వరాల వ్యాప్తిని నివారించేందుకు ప్రజలందరు తమ వంతు బాధ్యత నిర్వహించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలుంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి పరీక్షించుకోవాలన్నారు. నివాస ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగు కాలువలలో నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఇంటి పరిసరాలలో చెత్త లేకుండా శుభ్రపర్చుకోవాలని, ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రై డే పాటించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించేలా ప్రజలు సహకరించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద మహిళా ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్ళి వ్యాధి లక్షణాలను పరిశీలించాలన్నారు. వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన కిట్ల ద్వారా ప్రాథమికంగా నిర్ధారించడం జరుగుతుందని, జిల్లా ఆస్పత్రిలో టి హబ్‌లో నిర్ధారణకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని, డెంగ్యూ నివారణ దిశగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నివాస ప్రాంతాలు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లహరి, ప్రశాంతి, ఎస్‌యుఓలు నాందేవ్, సత్యనారాయణ, రవీందర్, హెచ్‌ఈ అల్లాడి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగులతో పాటు వారి పిల్లలకు కావాల్సిన వసతులు కల్పించి క్రీడానైపుణ్యాలు పెంచడమే లక్ష్యంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్(జీఎం) సంజీవరెడ్డి అన్నారు. ప్రాణహిత మైదానంలోని వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. క్రీడాలు కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే వారి పిల్లలకు వేసవి క్రీడా శిబిరాలను నిర్వహిస్తూ వివిధ క్రీడాంశాలలో నైపుణ్యాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. దీనిని ప్రతి ఒక్క క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, సీనియర్ పీఓ పి.కాంతారావు, స్పోర్ట్స్ హనరరీ సెక్రటరీ స్వజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ తోట సురేష్, ఫుట్‌బాల్ శిక్షకులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతిష్టాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డు కోసం అర్హత గల చేనేత కార్మికుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎస్. చరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు, చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, నైపుణ్యం కనపరచిన, చేనేత రంగంలో విశిష్ట సేవలు అందించిన చేనేత కళాకారులకు ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20లోపు అర్హత కలిగిన చేనేత కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియ, మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం ఆన్‌లైన్‌లో హ్యాండ్‌లుమ్స్.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌తో పాటు ఇతర వివరాలకు హైదరాబాద్‌లోని జిల్లా సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ. 500 సన్న వడ్లతో పాటు దొడ్డు వడ్లకు చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కేసీఆర్ పిలుపు మేరకు నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో గురువారం చెన్నూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బోనస్ సన్న, దొడ్డు వడ్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి వడ్ల గింజను కొటామని, క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చి సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను నిరశాకు గురి చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అన్ని హామీలు నెరవేర్చామని మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు రూ.15 వేల చొప్పున రైతు బంధు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం కేవలం మూడు ఎకరాలున్న రైతులకు మాత్రం రూ.10 వేల చొప్పున ఇచ్చి వంద ఎకరాలున్నా రైతు బంధు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా ఇదే జరిగిందని డిసెంబర్ 9న ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండు కోవడం కోసం ఆగస్టు వరకు పొడగించారని అన్నారు. రైతుల పక్షాన నిలబడి దొడ్డు, సన్న వడ్లకు బోనస్ చెల్లించే విధంగా పోరాడుతామన్నారు. నిసన కార్యక్రమంలో చెన్నూర్ నాయకులతో పాటు భీమారం, కోటపల్లి, జైపూర్, మందమర్రి మండల నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

డెంగ్యూకు కారణమయ్యే దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డా.ఉమా శ్రీ కోరారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు పెరుగుతాయన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, జ్వరం లాంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



నవతెలంగాణ
5
ఆదిలాబాద్
శుక్రవారం | మే 17, 2024 | www.navatelangana.com

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ టౌన్ 3 ఫీడర్‌లో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని భుక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెర కాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, మహా లక్ష్మివాడ, చిలుకూరి లక్ష్మినగర్, జైజవాన్ నగర్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

18న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 18న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పి సీఈఓ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలన్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు 18 నెలల జైలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భార్యను వేధించిన కేసులో భర్తకు 18 నెలల జైలు శిక్షతో పాటు రూ. 2500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం నిరాలకు చెందిన మహిళను ఆమె భర్త దీక్షిత్ వేధించడంతో అతనిపై 2016లో పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. న్యాయ విచారణ అనంతరం ముద్దాయికి 18 నెలలు జైలు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో జరిగింది.మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో నగేష్ అనే యువకుడు రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన నగేష్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్టు స్థానికులు తెలిపారు.

మేలైన పత్తి విత్తనాలు నాటుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాబోయే సీజన్‌లో రైతులు అధిక దిగుబడి వచ్చేల నాణ్యమైన పత్తి విత్తనాలు నాటుకొవాలని మైక్రో కంపెనీ రీజినల్ మేనేజర్ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మైక్రో రైతుల దినోత్సవం కార్యక్రమంలో పత్తి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట వేసే సమయంలో నాణ్యమైన కంపెనీలు విక్రయించే విత్తనాలను మాత్రమే కొని విత్తుకోవాలని, పత్తి పంటను ఆశించే చీడ పురుగులను, తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే మైక్రో కంపెనీ కొత్త రకమైన 7351 గోళ్ళ, మహారాజ అనే రెండు హైబ్రీడ్ సీడ్ విత్తనాలను రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. గత సంవత్సరం మైక్రో జెంగీ, దండెవ్ పత్తి విత్తనాలు నాటి అధిక దిగుబడి పొందిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ, రైతులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైనూర్

జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ట్రైబల్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్ఐ సందీప్‌కుమార్‌కు జర్నలిస్టుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుదాం, దత్తా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని 23 గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ యువ నాయకులు చకోర్ నాందేవ్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామాభివృద్ధితో పాటు కూలీల పెండింగ్ ఉపాధి హామీ డబ్బులు తదితర విషయాలపై విన్నవించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కార్తీక్ ఉన్నారు.

విద్యుత్ బోర్డులు ధ్వంసం చేసిన దుండగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తు తెలియని వ్యక్తులు కరెంట్ బోర్డులను ధ్వంసం చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌కు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ బోర్డులను దుంగడులు ధ్వంసం చేసినట్లు స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ తెలిపారు. స్విమ్మింగ్ పూల్‌కు ప్రతి నిత్యం నీటి సరఫరా చేసే మోటార్‌లకు అనుసంధానమైన కరెంటు బోర్డులను చెల్లాచెదురుగా చేసి వైర్లను కత్తిరించినట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు.

కుటుంబీకులపై దాడికి యత్నించిన యువకుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనలో ఓ యువకుడిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. టూ టౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఖుర్షీద్ నగర్ కాలనీకి చెందిన పవన్ తన భార్య మీద అనుమానంతో బుధవారం రాత్రి దాడికి ప్రయత్నించాడు. ఈ దాడిని అడ్డుకోవడానికి పవన్ తల్లిదండ్రులు అడ్డురాగా వారిపై కూడా దాడి చేశాడు. ఈ విషయమై తండ్రి నాగరావ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ బాదావత్ సంతోశ్



నవతెలంగాణ-హాజీపూర్

రైస్ మిల్లులకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. గురువారం మండలంలోని రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు వారి సామర్థ్యం మేరకు తరలించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో రైస్ మిల్లులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా మిల్లుల యజమానులు, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసి వాహనాలను వెనువెంటనే పంపించేలా చూడాలన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. గురువారం మండలం వేంపల్లి గ్రామంలోని కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి పనుల పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రయివేట్, కార్పోరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి సౌకర్యాలతో నాణ్యమైన విద్య బోధనాలుంటాయన్నారు. మరిన్నీ సౌకర్యాలు కల్పించేల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలతో పాటు అవసరమైన మరమ్మత్తు పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పోచయ్య, సమన్వయకర్త సత్యనారాయణమూర్తి, ఏఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుదాకర్ నాయక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది శాయశక్తులా కృషి చేయాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుదాకర్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకోని జిల్లా ఆస్పత్రిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ వ్యాధుల నిర్మూలనకు సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏడీస్ అనే దోమ వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని ఈ వైరస్ చాలా ప్రమాదకరమైందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు డెంగ్యూ కేసులు పెద్దగా నమోదు కాకపోవడం సంతోషకరమైన విషయమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు తీవ్రమైన జ్వరంతో పాటు శరీరం విపరీతమైన నొప్పులతో ఉంటుందన్నారు. వీటితో పాటు వాంతులు, విరోచనాలు, రక్తంతో కూడిన మలవిసర్జన లాంటి లక్షణాలుంటాయని ఇటువంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు సమన్వయం పాటించాలి : ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ నాయకులు సమన్వయం పాటించాలని, ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి కులమతాల పేరిట రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని, అందరు కూడా అప్రమత్తంగా ఉండి ఎలాంటి గొడవలకు వెళ్లకూడదని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేలా సహకరించాలని కోరారు. సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. విద్వేషాలు వీడి అందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నారు.

డెంగ్యూ నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవం



ఆదిలాబాద్‌టౌన్: డెంగ్యూ అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అధికారులు



తాంసి : అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లాలో డెంగ్యూ నివారణకు క్షేత్రస్థాయిలో పూర్తి చర్యలు తీసుకోవాలని, గత మూడు సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య చేస్తున్న కషి అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ జిల్లాలో 2022 నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలను తెలియజేశారు. పవర్పాయింట్ ద్వారా డెంగ్యూ ప్రబల తీరు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం డెంగ్యూతో పాటు వ్యాధుల నివారణకు కషి చేస్తున్న సిబ్బందిని సత్కరించి సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు ప్రతి పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మూడు సంవత్సరాలుగా జిల్లాలో కేసుల నమోదు శాతం తగ్గుతుందని, మరణాలు ఏమి జరగలేదన్నారు. అయినసరే అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంటి పరిశుభ్రత యాజమని బాధ్యత అయితే బయట పరిశుభ్రత అర్బన్ ప్రాంతంలో మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా నీరు నిల్వ ఉండగా కూండా చూడాలన్నారు. కొబ్బరి బొండలు, మెకానిక్ షాపుల్లో బొండలు, టైర్లలో నీరు లేకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తు నివారణకు కషి చేయాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డేలు నిర్వహించేలా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతంలో మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ ప్రజ్ఞాన్ మల్వీ, జిల్లా మలేరియ అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెడికల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : డెంగ్యూ వ్యాధిని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్య ప్రజలకు సూచించారు. గురువారం జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడీస్ దోమ కాటు వల్ల సోకుతుందని అన్నారు. వ్యాధి లక్షణాలు అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, కండరాల కీళ్లనొప్పులు, వాంతులు ఉంటాయని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కుండీలలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత కుమారి, కార్యదర్శి గంగన్న, లక్ష్మి, ఆశా కార్యకర్తలు, లక్ష్మి, ప్రభావతి ఉన్నారు.

ఇంద్రవెల్లి : డెంగ్యూ వ్యాధిపై స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో డెంగ్యూ దినోత్సవాన్ని జరుపుకున్నారు. మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది భీమ్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. నీటి ట్యాంకులు, ఇంటి పరిసరాల్లో నీళ్ల నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి పగటి వేళలో కుట్టే దోమవల్ల వస్తుందని తెలిపారు. దాని నివారణకు పరిశుభ్రతనే ముఖ్యమార్గమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ.సందీప్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకొని గురువారం డాక్టర్ ప్రత్యుష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ దోమల నివారణకు ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డేగా పాటించాలని డాక్టర్ ప్రత్యుష అన్నారు. ప్రతీ రెండు రోజులకు ఇంటి ఆవరణలో నీటి నిల్వలు తొలగించి, నీటి నిల్వ తోట్టెలు ఆరబెట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధి నివారణకు పాటు పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, శివకుమార్ పాల్గొన్నారు.

నార్నూర్ : జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని గురువారం వైద్యసిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఖంపూర్ గ్రామ పంచాయతీలో డాక్టర్ రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఏడీస్ దోమ కుట్టుటడం వల్ల వ్యాధి వస్తుందని తెలిపారు. కుట్టినప్పుడు జ్వరం, తలనొప్పి, కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, వికారం, వాంతులు రావడం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఇలాంటి వారిని వైద్య సిబ్బంది గుర్తించి పరీక్షలు నిర్వహించేల చూడాలని సూచించారు. జూన్ నెలలో వర్షకాలం సమీపిస్తున్న తరుణంలో ఇంటి వద్ద డబ్బలలో, పాత టైర్లలో, పూలకుండీలలో, కవర్లలో, మురికి కాలువలో నీరు ఆగకుండా రోజు శుభ్రంగా ఉంచుకోవాలని వాటి పైన మూతలు ఉంచి వాడుకోవాలని ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది హిమ బిందు, గోకుల్, ఈశ్వరి, విద్యారాణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



ఇంద్రవెల్లి



లక్ష్మణచాంద



నార్నూర్